క్లుప్తంగా

అన్ని వర్గాలకూ ప్రాధాన్యం

రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి, జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ ఆరిఫ్

సీటీఆర్ఐ: ముస్లింల అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్, రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి మొహమ్మద్ ఆరిఫ్ అన్నారు. మంగళవారం స్థానిక జాంపేటలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత 2019 అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీలకు ఐదు అసెంబ్లీ సీట్లు కేటాయించగా, ఈసారి 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఏడుగురు ముస్లిం అభ్యర్థులను ప్రకటించడంపై రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ముస్లింలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. అందులోనూ ముస్లింలలో అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం దక్కేలా ఒక మహిళకు, ఒక రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్‌కు, ఒక మాజీ కార్పొరేటర్‌కు, ఒక సామాన్య కార్యకర్తకు టికెట్ కేటాయించడంతో వల్ల ముస్లిం సమాజంలోని అన్ని వర్గాల నుంచి నాయకులను తయారు చేసి సోషల్ ఇంజినీరింగ్ అనే పదానికి నిజమైన నిర్వచనాన్ని ఇచ్చారన్నారు. మతతత్వ బీజేపీతో చెలిమి చేసిన టీడీపీ ఏ ముఖం పెట్టుకొని మైనార్టీల ఓట్లు అడుగుతోందని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో ముస్లింలకు ఎటువంటి మేలు చేయలేదన్నారు.

263 మందికి వైద్య పరీక్షలు

కడియం: రెండో విడత ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం మాధవరాయుడుపాలెం సచివాలయం–2లోని చైతన్యనగర్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 263 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ ఎస్. సాయిమౌర్య ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో 33 మందికి కంటి వైద్య పరీక్షలను చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సాయి మౌర్య, మణిజ్యోత్స్న రాజమహేంద్రవరం సాయి హాస్పటల్‌కు చెందిన డా. గౌతమ్, కిమ్స్ హాస్పటల్ కార్డియాలజిస్ట్ స్నేహ, రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి ఆప్తాల్మిక్ ఆఫీసర్ వీ.సత్యప్రసాద్ వైద్య సేవలందించారు. ఎంపీడీవో జి.రాజీమనోజ్ శిబిరాన్ని పర్యవేక్షించారు. వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పోటీచేసే అభ్యర్థులు అనుమతికి దరఖాస్తు చేసుకోవాలి

రాజమహేంద్రవరం రూరల్: ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయా పార్టీలు విధిగా సువిధా పోర్టల్ ద్వారా ముందస్తు అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలని రాజమండ్రి రూరల్ అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలక్టరు ఎస్.తేజ్ భరత్ అన్నారు. మంగళవారం రాత్రి జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో రాజకీయ ప్రతినిధులతో జరగబోవు ఎన్నికలపై సూచనలు తెలుపుతూ సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలని సజావుగా నిర్వహించే క్రమంలో రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలన్నారు. ప్రచారాలకు ముందస్తు అనుమతులు అవసరమన్నారు. ఈ సమావేశంలో పలు రాజకీయ పార్టీలు ప్రతినిధులు, తహసీల్దార్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

518 మందికి వైద్య సేవలు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట గ్రామసచివాలయం–1 పరిధిలో మంగళవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో 505 మందికి పరీక్షలు నిర్వహించారు. ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి డా.కె. సుధాకర్, ఆరోగ్యశిబిరాన్ని ప్రారంభించారు. పీహెచ్‌సీ వైద్యురాలు లిడియాసుచిత్ర, స్పెషలిస్ట్ వైద్యులు, ఆప్తాల్మిక్ ఆఫీసర్ డి.సాంబయ్యలు సేవలు అందించారు. అవసరమైన వారికి రక్తపరీక్షలు,బీసీపరీక్షలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గుంట్రు వెంకటరావు, వైద్యసిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ముగిసిన ఓనువులమ్మ ఆలయ వార్షికోత్సవాలు

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడు గ్రామంలోని ఓనువులమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాలు మంగళవారంతో ఘనంగా ముగిశాయి. మంగళవారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్య భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకునర్నారు. గ్రామంలో భక్తులకు భారీ అన్న సమరాధన కార్యక్రమం నిర్వహించారు. సుమారు వెయ్యి మంది పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

ప్రజాగళం సభలో పోలీసుల వైఫల్యం

రాజమహేంద్రవరం రూరల్: ప్రజాగళం సభలో పోలీసుల వైఫల్యం అడుగడుగునా కనిపించిందని రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ హాజరైన చిలకలూరిపేట బొప్పాడి ప్రజాగళం సభ భద్రతలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసు ఉన్నతాధికారులపై చీఫ్ ఎలక్షన్ కమిషన్ చర్యలు తీసుకోవాలన్నారు.

రమేష్‌కిశోర్‌పై విచారణకు ఆదేశం

కంబాలచెరువు : పూర్వ డీసీహెచ్ఎస్ డాక్టర్ టి.రమేష్ కిశోర్‌పై విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ వివరాలను జిల్లా డీసీహెచ్ఎస్ ఎం.సనత్‌కుమార్ మంగళవారం తెలిపారు. పూర్వ ఆసుపత్రి సేవల జిల్లా సమన్వయకర్త డాక్టర్ రమేష్‌కిశోర్‌పై అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ నుంచి న్యాయవాదులు గొట్టిముక్కల అనంతరావు, ధర్నాలకోట వెంకటేశ్వరరావు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం కొవ్వూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో విచారణ చేపడుతున్నట్టు ఆమె తెలిపారు. విచారణ అధికారిగా విజయనగరం డీసీహెచ్ఎస్ డాక్టర్ బి.గౌరీశంకరరావు నియమితులయ్యారన్నారు.

అనతి కాలంలో అభివృద్ధి

- పూర్తయిన సచివాలయాలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు
- గాడినపడిన పారిశుధ్య నిర్వహణ
- ప్రత్యేక దృష్టి సారించిన మంత్రి చెల్లుబోయిన వేణు



పారిశుధ్య కార్మికులతో కలిసి పూడికలు తొలగిస్తున్న మంత్రి వేణు

ధవళేశ్వరం: గ్రామంలో అభివృద్ధి వైపు పరుగులు తీస్తోంది. వైఎస్సార్ సీపీ రూరల్ కో–ఆర్డినేటర్‌గా బాధ్యతలు స్వీకరించిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి, బీసీ సంక్షేమం, సమాచారం, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ధవళేశ్వరంపై ప్రత్యేక దృష్టి సారించారు. అభివృద్ధి పనుల వేగాన్ని పెంచారు. దీంతో గ్రామంలోని నాలుగు సచివాలయాలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు పూర్తయ్యాయి. రూ.2.40 కోట్లతో నిర్మించిన వాటిని మంత్రి చెల్లుబోయిన వేణు ప్రారంభించారు. దీంతో ప్రజలకు సచివాలయాల సేవలు మరింత దగ్గరయ్యాయి. గ్రామంలో రోడ్లు, డ్రైన్లు పనులకు కూడా శంకుస్థాపన చేశారు. గ్రామంలో వాటర్‌ట్యాంకు నిర్మాణానికి నిధులు కేటాయించడంతో పాటు సంపు నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించమని అధికారులను ఆదేశించారు. బాధ్యతలు స్వీకరించిన అనతి కాలంలోనే కోట్లాది రూపాయలు వెచ్చించి గ్రామాన్ని అభివృద్ధి బాట పట్టిస్తున్న మంత్రి వేణుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



ధవళేశ్వరంలో నిర్మాణం పూర్తి అయిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్

గాడిన పడిన డ్రైనేజీ వ్యవస్థ

అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థ, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. మంత్రి వేణు స్వయంగా క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ డ్రైనేజీ వ్యవస్థ, పారిశుధ్య నిర్వహణను గాడిన పెట్టారు. తాత్కాలిక పనులతో సరిపెట్టకుండా అదనంగా పారిశుధ్య సిబ్బందిని తీసుకొని ప్రధాన డ్రైనేజీల్లో పూడికను తొలగించారు. దీంతో ధవళేశ్వరంలోని కాటన్‌పేట తదితర ప్రాంతాలు ముంపు బారి నుంచి బయటపడ్డాయి. అలాగే సుమారు 80 చోట్ల నూతన డ్రైనేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

ప్రజలతో మమేకమవుతూ..

వైఎస్సార్ సీపీ రూరల్ కో–ఆర్డినేటర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మేజర్ పంచాయతీ అయిన ధవళేశ్వరంపై ప్రత్యేక దృష్టి సారించిన మంత్రి చెల్లుబోయిన వేణు ప్రజలతో మమేకమవుతూ ముందుకు సాగుతున్నారు. ప్రజలను అడిగి తెలుసుకొని వెంటనే ఆ పనులను పూర్తి చేస్తున్నారు.

రుణపడి ఉంటాం



గ్రామంలో ప్రధాన సమస్యగా మారిన డ్రైనేజీ వ్యవస్థను గాడిన పెడుతున్న మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణకు రుణపడి ఉంటాం. ఎన్నో ఏళ్లగా డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడికను తొలగించేందుకు ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టడం హర్షనీయం. పూడికలు తొలగించడం ద్వారా వర్షాకాలం ముంపు సమస్య నుంచి బయటపడతాం.

– కేవీఆర్ సాగర్, ధవళేశ్వరం

అభినందనీయం



ధవళేశ్వరం గ్రామాన్ని మంత్రి వేణు అభివృద్ధి బాటలో నడిపించారు. రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి లక్షలాది రూపాయలు కేటాయించడం అభినందనీయం. సచివాలయ భవనాలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో ఉంచడం ద్వారా ప్రభుత్వ సేవలు మరింత దగ్గర చేశారు.

– వంగా వెంకటేష్, ధవళేశ్వరం

అర్హులందరికీ సొంతిళ్లు కట్టిస్తా

- ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్



క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చామని ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత ఇళ్ల కూడా కట్టించి ఇస్తానని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ లబ్ధిదారులకు భరోసా ఇచ్చారు. మంగళవారం నగరంలోని 32వ డివిజన్ ఇన్‌చార్జి ముప్పన శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన పర్యటనలో ఎంపీ భరత్ రామ్ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. మీ అందరి ఆశీస్సులతో ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. ప్రతిపక్ష టీడీపీ ఇళ్ల పట్టాలు ఫేక్ అని దుష్ప్రచారం చేస్తోందని, అటువంటి వారి మాటలు నమ్మవద్దన్నారు. నగరాన్ని ఎంతో అభివృద్ధి చేశా నచ్చితేనే ఓటు వేయాలని కోరారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా జగనన్న పాలన అందించారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు రండి

- టీడీపీ శ్రేణులకు సవాల్ విసిరిన వైఎస్సార్ సీపీ మాజీ కార్పొరేటర్ల బృందం

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎంపీ మార్గాని భరత్‌రామ్ నేతృత్వంలో రాజమహేంద్రవరం నగరంలో జరిగిన అభివృద్ధిపై టీడీపీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు బహిరంగ చర్చకు సిద్ధం కావాలని వైఎస్సార్ సీపీ మాజీ కార్పొరేటర్ల బృందం సవాల్ విసిరారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల్లో టీడీపీ ఓటమి ఖాయమని గ్రహించి ఆ పార్టీ మాజీ కార్పొరేటర్లు లేనిపోని మాటలు మాట్లాడుతున్నారని వైఎస్సార్ సీపీ మాజీ కార్పొరేటర్లు పోలు విజయలక్ష్మి, గుత్తుల మురళీధర్, ఈతకోట బాపన సుధారాణి, ప్రసాదుల హరనాథ్, బర్రే కొండబాబు, వాసంశెట్టి గంగాధర్, ఏవీ రమణ తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ నేతలు తామే నగరాన్ని అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకోవడం హస్యాస్పదంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో జరిగిన అభివృద్ధి, టీడీపీలో జరిగిన అభివృద్ధిపై బహిరంగంగా చర్చిద్దామంటూ సవాల్ విసిరారు. 2019 నుంచి 2024 వరకూ ఎంపీ మార్గాని భరత్ రామ్ హయాంలో ఎలా అభివృద్ధి జరిగిందో శ్వేత పత్రం విడుదల చేయడానికి మేము సిద్ధంగా ఉన్నామని, టీడీపీ హయాంలో ఏమి చేశారో శ్వేత పత్రం విడుదలకు సిద్ధం కావాలన్నారు. ఒకే కుటుంబంలో మేయర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే మూడు పదవులను 16 సంవత్సరాల పాటు అనుభవిస్తూ నగరానికి ఏం చేశారో చెప్పాలన్నారు. ఒకే రోజు 25 వేల కుటుంబాలకు ఇళ్ల స్థలాలిచ్చి ఎంపీ భరత్ చరిత్ర సృష్టిస్తే బోగస్ పట్టాలంటూ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. పుష్కరాలకు 29 మంది మరణిస్తే దాని గురించి టీడీపీ నేతలు మాట్లాడరన్నారు. మోరంపూడి పై ఓవర్ బ్రిడ్జి, విమానాశ్రయ అభివృద్ధి పనులు, రైల్వే అభివృద్ధి, నగరంలో పార్కుల అభివృద్ధి, సీసీ రోడ్లు, డ్రైనేజీల, డివైడర్ల అభివృద్ధి, పుష్కర్ ప్లాజా, గ్లో పార్క్, సుబ్రహ్మణ్యం మైదానం అభివృద్ధి, ప్రభుత్వ మెడికల్ వైద్య కళాశాల, ఈఎస్ఐ హాస్పిటల్ ఇలా ఎన్నో అభివృద్ధి పనులను ఎంపీ భరత్‌రామ్ కేవలం మూడు సంవత్సరాలలో పూర్తి చేశారన్నారు. ప్రజలంతా ఎంపీ భరత్ రామ్ విజయం ఖాయమని అంటుంటే తట్టుకోలేక లేనిపోని విమర్శలకు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరి రాధిక, అజ్జరపు వాసు, పిల్లి నిర్మల, వియస్ రావు, వాకచర్ల కృష్ణ, మజ్జి నూకరత్నం, బొడిశెట్టి సత్యవేణి, బూరాడ కృష్ణ మాధురి, మానే దొరబాబు, నీలపాల తమ్మారావు, బెజవాడ రాజకుమార్, అరవ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి నిరంతర ప్రక్రియ

- ఈఎస్ఐ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించిన ఎంపీ భరత్



కంబాలచెరువు (రాజమహేంద్రవరం): అయిదు సంవత్సరాలుగా రాజమహేంద్రవరంలో అభివృద్ధి శరవేగంగా పరుగులు తీస్తోందని ఎంపీ, సిటీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి ఒక నిరంతర ప్రక్రియ అని చెప్పారు. నగరంలోని పేపర్ మిల్స్ సమీపంలో రూ.100 కోట్లతో నిర్మిస్తున్న ఈఎస్ఐ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను ఎంపీ భరత్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఈఎస్ఐ ఆసుపత్రిలో 50 వేలమందికి పైగా సభ్యత్వం కలిగి ఉన్నారని, ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. రెండు దశాబ్దాలుగా ఈఎస్ఐ ఆసుపత్రి జీర్ణావస్థకు చేరినా టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. మరి అప్పట్లో ఎన్డీఏలో ఉన్న టీడీపీ ప్రభుత్వం కేంద్రం నుంచి నిధులు ఎందుకు తెచ్చుకోలేకపోయిందని ప్రశ్నించారు. ఇప్పుడు లోకల్ టీడీపీ నేతలు చెబుతున్నట్లు అవి సెంట్రల్, స్టేట్, ఆర్ఎంసీ నిధులంటున్నారని, ఏవైతే ఏమిటి. అభివృద్ధి జరుగుతోందా లేదా అనేది చూడాలన్నారు. ఈఎస్ఐ ఆసుపత్రిని ఐదు ఎకరాల స్థలంలో వంద పడకల ఆసుపత్రిగా నిర్మిస్తున్నట్టు చెప్పారు అత్యంత అధునాతనమైన సాంకేతిక వైద్య పరికరాల సహాయంతో రోగులను పరీక్షిస్తారన్నారు. భవన నిర్మాణం పూర్తి కావస్తోందని, వచ్చే నెలలో ప్రారంభం కాబోతోందన్నారు. వివిధ రంగాలలో పనిచేసే కార్మికులందరికీ ఈఎస్ఐ సదుపాయం కల్పించాలనేది తన కోరిక అన్నారు.

సామాజిక విప్లవానికి జగన్ శ్రీకారం

చట్టసభలలో అర్ధ సింహాసనం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు కేటాయించి సామాజిక విప్లవానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని ఎంపీ భరత్ తెలిపారు. రాష్ట్రంలో 175 అసెంబ్లీ స్థానాలకు 84 స్థానాలను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ప్రకటించారన్నారు. 25 లోక్‌సభ స్థానాలకు 16 స్థానాలను కేటాయించారని, ఇది ఒక చరిత్ర అన్నారు. అసెంబ్లీ, లోక్‌సభ స్థానాల కలిపితే మొత్తం 200 కాగా వందకు పైగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు కేటాయించిన సీఎం జగన్ అభినందనీయులన్నారు. టీడీపీ ఈ విధంగా ఎందుకు ప్రకటించలేకపోయిందన్నారు. సామాజిక చైతన్యం, సంక్షేమం, అభివృద్ధి ఒక్క జగనన్న ద్వారానే సాధ్యమన్నారు. అందుకే ప్రజలు జగనన్న పాలనను విశ్వసిస్తున్నారన్నారు.

రాజకీయ ప్రకటనలు నిషేధం

- ప్రభుత్వ ఆస్తులు, సంస్థలపై ఎన్నికల ప్రచారం చేయకూడదు
- జెండాలు, పోస్టర్లు ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి
- కలెక్టర్, డీఈఓ మాధవీలత



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): మోడల్ ప్రవర్తనా నియమావళిలో ప్రభుత్వ రవాణా, పోస్టాఫీసులు, ప్రభుత్వ ఆసుపత్రులు, డిస్పెన్సరీల స్థలాల్లో ఏదైనా రాజకీయ ప్రకటన ఉంటే, వెంటనే వాటిని తీసేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత అన్నారు. మంగళవారం సాయంత్రం వెలగపూడి నుంచీ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులతో ప్రకటనలు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు, ఈవీఎం రాండమైజేషన్, ప్రతికూల వార్తలు, పీవో, ఏపీఓ శిక్షణ తదితర అంశాలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యం చేస్తున్న ప్రిసైడింగ్ అధికారి, సహాయ ప్రిసైడింగ్ అధికారి, ఇతర పోలింగ్ సిబ్బందికి ముందస్తుగా శిక్షణ ఇచ్చేందుకు కార్యచరణ రూపొందించామన్నారు. రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశామన్నారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్‌లు, విమానాశ్రయం, వంతెనలు, రెల్వే, రోడ్‌వేలు, ప్రభుత్వ స్థలాన్ని ఉపయోగించడం, బస్సులు, ప్రభుత్వ భవనాలు, విద్యుత్, టెలిఫోన్ స్తంభాలు, మున్సిపల్, స్థానిక సంస్థల భవనాలపై రాజకీయ ప్రకటనల ఉండకూడదన్నారు. వ్యాపార సముదాయాలు వద్ద కేవలం ఆయా వ్యాపార ప్రకటనలు తప్ప రాజకీయ ప్రచారం కోసం వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్లు, ఆటోలు, ఇతర వాహనాలపై ఎటువంటి రాజకీయ పార్టీల ఫొటోలు, స్లొగన్లు ఉండకూడదన్నారు. లేకుంటే రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రాజమహేంద్రవరం రూరల్ ఆర్వో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్, అర్బన్ ఆర్వో మున్సిపల్ కమిషనర్ కె.దినేష్‌కుమార్, కొవ్వూరు ఆర్వో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్, డీఆర్వో జి.నరసింహులు, రాజానగరం ఆర్వో, ఆర్డీఓ ఎ.చైత్ర వర్షిణి నియోజకవర్గాల ఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

ఖైదీల కుటుంబ సభ్యులతో సమావేశం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్న ఖైదీల కుటుంబ సభ్యులతో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ న్యాయవాది, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రత్యూషకుమారి ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్తి వివాదాలు, కుటుంబ సభ్యుల మధ్య సమస్యలు, ఇతర న్యాయ సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి వాటిని పరిష్కరించుకోవాలన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి అందక పోయినా ఈ సంస్థ సహకారంతో సమస్యలు పరిష్కరించుకోగలరన్నారు. ఆర్థిక సమస్యల కారణంగా పిల్లల విద్యాభ్యాసం ఆగిపోవడం, సమాజంలో ఖైదీల కుటుంబ సభ్యుల పట్ల వారి పిల్లల పట్ల వివక్ష చూపడం వంటి ఇబ్బందులు ఎవరికైనా ఎదురైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఖైదీలకు అందిస్తున్న ఉచిత న్యాయ సేవలపై వారికి అవగాహన కల్పించారు. అనంతరం ఓఎన్‌జీసీ గోదావరి గోల్ఫ్ క్లబ్‌లో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ప్రత్యూషకుమారి మాట్లాడుతూ మహిళలపై జరు అన్యాయాలను ధైర్యంగా ఎదుర్కొని వారి హక్కులను పరిరక్షించుకోగల సామర్థ్యం పెంచుకోవాలన్నారు. ఇబ్బందులకు భయపడి తొందరపాటు నిర్ణయాలు తీసుకోరాదన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రత్యూషకుమారి

జాంపేట చేపల మార్కెట్‌లో మత్స్యకారులకు న్యాయం

- కలెక్టర్, కమిషనర్‌లకు కృతజ్ఞతలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మత్స్యకారులు

రాజమహేంద్రవరం సిటీ: వివాదాస్పదంగా ఉన్న జాంపేట చేపల మార్కెట్‌లో మత్స్యకారులకు న్యాయం జరిగిందని జాంపేట చేపల మార్కెట్ కమిటీ గౌరవ అధ్యక్షుడు వెలమ లక్ష్మణరావు ఆనందం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇన్నాళ్లు మత్స్యకారులను దళారులు శాసిస్తూ వచ్చారన్నారు. చేపల మార్కెట్‌లో లాటరీ తీయకుండా హైకోర్టుకు వెళ్లారని దీనిపై తాము కోర్టును ఆశ్రయించగా హైకోర్టు ఆర్డర్ ప్రకారం కలెక్టర్ ఆదేశించడంతో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఇరు వర్గాలను కూర్చోబెట్టి లాటరీ వేసి న్యాయం చేశారన్నారు. అయితే లాటరీ పద్ధతి వద్దంటూ కమిషనర్ డౌన్‌డౌన్ అంటూ జాంపేట చేపల మార్కెట్ హోల్ సేల్ అండ్ రిటైల్ చేపల వర్తక సంక్షేమ సంఘం పక్షాన ధర్నా చేసి అభాసుపాలు చేయడాన్ని మత్స్యకారుల తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గతంలో జిల్లా కోర్టులో తమపై దావా వేసి ఓడిపోయారని అయినప్పటికీ కేవలం ఆరుగురు వ్యక్తులు ఇంకా ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని లక్ష్మణరావు ఆరోపించారు. తమకు న్యాయం చేసిన కలెక్టర్‌కు, కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో గోదావరి బెస్తా మహిళా సంఘం లిమిటెడ్ సంఘం, గోదావరి మాత ఫిషర్ మెన్ సంక్షేమ సంఘం, గోదావరి మాత మత్స్యకార సంక్షేమ సంఘాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

బైబిల్ మిషను మహాసభలు ప్రారంభం



సభలో మాట్లాడుతున్న విజయరాజు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం సెయింట్ పాల్స్ చర్చ్ గ్రౌండ్‌లో బైబిల్ మిషను రాజమహేంద్రవరం మహాసభలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బైబిల్ మిషన్ ప్రెసిడెంట్ బిషప్ డాక్టర్ ఎస్.విజయరాజు మహాసభను ప్రారంభించారు. కేథడ్రల్ సభ్యులు, గోల్డెన్ జూబిలీ మందిర విశ్వాసులు, స్వస్థత శాల సభ్యులు బైబిల్ మిషన్ తెలుగు క్రైస్తవ కీర్తనలు ఆలపించారు. డాక్టర్ ఎస్.విజయరాజు ప్రత్యేక ప్రార్థన చేసి సభలో మాట్లాడారు. అలాగే బైబిల్ మిషన్ గవర్నింగ్ బాడీ సభ్యులు రెవ షభినాబాబు, రెవ సుధాకర్ కూడా ప్రసంగించారు. రెవ.డి.షాలేము రాజు, రెవ. పీజే సుధాకర్, రెవ.సువర్ణ రాజు, రెవ.డా.ఎస్.సిమ్యోన్ సుదర్శన్, రెవ. ఎస్.విలియం బెంటిక్, ఎస్.ఉషారాణి, స్వర్ణకుమారి, పాస్టర్లు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలి

రాజమహేంద్రవరం రూరల్: అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు సార్వత్రిక ఎన్నికలు–2024 కోసం ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ఎన్నికల ప్రవర్తనా నియమావళిని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు కచ్చితంగా పాటించాలని రాజమండ్రి రూరల్–51 అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, రూరల్ తహసీల్దార్ వైవీకే అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నియమావళిని అమలు చేసేందుకు అన్నీ రాజకీయ పార్టీలు, అభ్యర్థులు రాజమండ్రిరూరల్–51 రిటరిన్నింగ్ అధికారికి సహకరించాలని కోరారు. పోలింగ్ బూతుకు 200 మీటర్ల పరిధి వరకుఎటువంటి సభలు, సమావేశాలు, కార్యక్రమాలు చేయకూడదన్నారు. ఈనెల 16వ తేదీకి ముందు ఏర్పాటు చేసిన ప్రకటన బోర్డులు వెంటనే తొలగించాలన్నారు. లేకుంటే ఆ బోర్డులన్నీ తొలగించేందుకు అయ్యే ఖర్చుని రాజకీయ పార్టీ వారి పేరిట నమోదు చేస్తామన్నారు. ఎన్నికల ఫిర్యాదులు స్వీరించేందుకు రాజమండ్రి రూరల్ రిటర్నింగ్ అధికారి వారి కార్యాలయంలో కాల్‌సెంటర్ ఏర్పాటు చేశామని, 0883–2416005 నంబర్‌కు కాల్ చేయవచ్చని తెలిపారు. ఏదైనా అనుమతులు కావాలంటే జాయింట్ కలెక్టర్ అనుమతి పొందాలని సహాయ రిటర్నింగ అధికారి అప్పారావు తెలిపారు.

ఉద్యోగుల గ్రీవెన్స్‌కు ఐదు అర్జీలు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం పరిధిలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మంగళవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు ఐదు అర్జీలు వచ్చినట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఉద్యోగుల గ్రీవెన్స్ నిర్వహించామన్నారు. స్వీకరించిన సమస్యల పరిస్కారం నిమిత్తం స్వీకరించిన అర్జీలను జిల్లాలో నమోదు చేసి ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు పంపించామన్నారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ పి.శ్రీనివాస్, డిప్యూటీ డీఈఎంఓ డాక్టర్ సత్యకుమార్ నల్లూరి, సూపరింటెండెంట్ కేవీవీ సత్యనారాయణ, ఇతర వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నేడు మదన గోపాల స్వామి కల్యాణోత్సవం

కడియం: దుళ్లలోని రుక్మిణీ సత్యభామా సమేత మదన గోపాల స్వామివారి కళ్యాణోత్సవం బుధవారం నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు శ్రీమాన్ ఖండవల్లి రాధాకృష్ణమాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం మధ్యాహ్నం శేషవాహనోత్సవం ఉంటుందన్నారు.

150 లీటర్ల సారాతో ఒకరి అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట డిబ్లాకుకు చెందిన బొడ్డు రాజు 150లీటర్ల సారాను తరలిస్తుండగా బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఎస్సై అంకారావు,సిబ్బందితో అతనిని అరెస్టు చేసి, సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.